క్లుప్తంగా

సర్పంచ్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ సర్పంచ్ పాండుగౌడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుబంధ సంఘం ఐఎస్‌టీయూఎస్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం సర్పంచ్‌ను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వెంకటయ్యయాదవ్, రామస్వామి, రవిందర్‌రావు తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఆశావర్కర్లకు హెల్త్ డైరెక్టర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో మరోమారు పోరాటానికి సిద్ధం అవుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాదిరి ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పాదిల రామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

పెంట్లవెల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు, రైతుబీమా, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, దళితబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, రాజేష్, సురేందర్‌గౌడ్, మతీన్, శేషు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం తోటల సాగుతో లాభాలు



తాడూరు: ఆయిల్‌ఫాం తోటల సాగుతో లాభాలు పొందవచ్చని పట్టుపరిశ్రమల శాఖ అధికారి సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపూర్‌లో రైతు వెంకటరెడ్డి సాగు చేసిన ఆయిల్‌ఫాం తోటలో గెలలను కట్ చేశారు. టన్ను రూ.30 వేల వరకు ధర పలుకుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల రైతులు ఆయిల్‌ఫాం తోటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి మహేశ్వరి, ఆయిల్‌ఫామ్ కంపెనీ ఏరియా మేనేజర్ రాకేష్, క్లస్టర్ అధికారి రామకృష్ణ, శివభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో చిట్టిగోరి శ్రీను అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వేర్వేరుగా బాధిత కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

చారకొండ: మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి తండ్రి లింగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చింతపల్లి గోపాల్ తల్లి సత్యమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, మండల అధ్యక్షుడు రవీందర్, కోఆప్షన్ సభ్యులు సలీం, రమేష్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని నాలుగో వార్డులో అనారోగ్యంతో తండ్రి కురుమయ్య, నీటి గుంతలో పడి కుమారుడు శివయ్య మరణించడంతో వారి కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అందించిన రూ.10 వేల నగదును స్థానిక నాయకులు అందజేశారు.

నియమావళి అమలు చేస్తాం

కల్వకుర్తి: పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేస్తామని ఆర్డీఓ శ్రీను అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, వివిధ శాఖల అధికారులతో కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ పరిధిలోని అన్ని మండలాలకు ప్రత్యేక అధికారుల కేటాయింపు పూర్తయిందని, వారంతా విధులలో సక్రమంగా పాల్గొనాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్, ఓటరు యాప్‌లపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎన్నికలలో డబ్బుల ప్రవాహం, అనధికారిక గోడ రాతలు, ఫ్లెక్సీలు, ప్రచారంలో అభ్యర్థులు అనుసరిస్తున్న విధానాలు, ఇతరత్రా వాటిపై ప్రత్యేక నిఘాను ఉంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు ఏర్పాటు

ఎన్నికలలో అసెంబ్లీ పరిధిలోని ఆయా మండలాలలో జరుగుతున్న ఎన్నికల సరళితో పాటుగా, ఇతరత్రా కార్యక్రమాలపై పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, మొబైల్ వాహనాలను ఆర్డీఓ శ్రీను ప్రారంభించారు. అసెంబ్లీ పరిధిలో కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాలకు కలిపి ఒకటి, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలలకు కలిపి ఒకటి, మాడ్గుల, ఆమనగల్లు మండలాలకు కలిపి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. ఈ టీంలలో డివిజన్ స్థాయి అధికారి ఇన్‌చార్జ్‌గా ఏఎస్‌ఐ స్థాయి అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో ఏదైనా శాఖ అధికారి, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారని వివరించారు. ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడూ వీడియో చిత్రీకరణ చేస్తారని పేర్కొన్నారు. జిల్లా సరిహద్దులుగా ఉన్న ఊర్కొండ మండలంలోని బోయిన్‌పల్లి, వెల్దండ మండలంలోని రాఘాయిపల్లి వద్ద పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అసెంబ్లీ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్లు, కల్వకుర్తి, ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్లు, పలు శాఖల అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ శ్రీను, డీఎస్పీ పార్థసారథి

ఆస్పత్రి ఎదుట ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ల్యాబ్ టెక్నిషియన్లు రోగుల రక్తపరీక్షల రిపోర్టులను ఒకరికి సంబంధించిన రిపోర్టును ఇతరులకు ఇస్తున్నారని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ డిమాండ్ చేశారు. ఒకరికి అందాల్సిన వైద్యం మరొకరికి అందుతుందని ఫలితంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో పర్యవేక్షణ లేకపోవడం ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. తక్షణం ల్యాబ్ టెక్నిషియన్‌లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చింత శివకుమార్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్



పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ శ్రీనివాస్ నిజాయితీని చాటుకున్నాడు. పెద్దపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సులో నాగర్‌కర్నూల్ నుంచి పెద్దముద్దునూర్‌కు వెళ్తోంది. హడావుడిలో ఎల్లమ్మ పర్సు బస్సులో కిందపడింది. గమనించిన బస్సు కండక్టర్ పర్సులో రూ.800లు, కాళ్లమెట్టెలు, తాళిబొట్టు ఉన్నట్లు గుర్తించాడు. దీంతో పెద్దకొత్తపల్లిలో ఆర్‌టీసీ బస్సు కంట్రోలర్ నిరంజన్‌ను బాధితురాలి పర్సును అందజేశాడు. అధికారులు ప్రయాణికురాలికి సమాచారం ఇవ్వగా మండల కేంద్రంలోని కంట్రోలర్‌ను సంప్రదించింది. దీంతో ప్రయాణికురాలు ఎల్లమ్మకు పర్సును అప్పగించారు. నిజాయితీని చాటుకున్న కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వెల్దండ: మండలంలోని అజిలాపూర్, బైరాపూర్ తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సందర్భంగా గ్రామాల్లో పార్టీ జెండాలను తొలగించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు, తాగునీరు, ప్రహరీ, వికలాంగులకు ప్రత్యేక ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కోడ్ ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కార్యదర్శి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు టీకా వేయించాలి



అచ్చంపేట రూరల్: ప్రతి చిన్నారికి టీకా వేయించాలని ఉదృత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రణీత, డాక్టర్ రోహిత అన్నారు. డివిజన్ పరిధిలో గల గ్రామాల్లో కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. పట్టణంలోని జూబ్లీనగర్, ఉట్లకోనేరు ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి చిన్నారుల టీకా స్థాయిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికి 12 రకాల ప్రాణాంతక వ్యాధులు రాకుండా సంపూర్ణ టీకాలు వేయించాలన్నారు. తల్లిదండ్రులు బాధ్యతగా చిన్నారులకు టీకాలు వేయించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అశోక్‌ప్రసాద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

చారకొండ: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని మర్రిపల్లి వద్ద చెక్‌పోస్టును మంగళవారం సీఐ సోమనర్సయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం రవి, ఏఎస్‌ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దళితబంధులో అనర్హుల పేర్లు తొలగించాలి



ఊర్కొండ: దళితబంధు పథకంలో అనర్హుల పేర్లు తొలగించాలని మంగళవారం గ్రామానికి చెందిన దళితులు నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాయలయం ఎదుట ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఊర్కొండ సర్పంచ్ రాజయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులకు దళితబంధు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కొల్లాపూర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్‌జీఓ డివిజన్ అధ్యక్షుడు జీకే వెంకటేష్, జిల్లా సహ అధ్యక్షుడు పసుల సత్యనారాయణ యాదవ్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీఎన్‌జీఓ సంఘ భవనంలో సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యత్వ నమోదు అంశాలపై చర్చించారు. సమావేశంలో రాజు, గణేష్‌బాబు, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై నిఘా

కల్వకుర్తి టౌన్: ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ప్రత్యేకంగా నిరంతర నిఘా ఉంచినట్లు కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలలో అనుసరించాల్సిన పద్ధతులు, ఇతర అంశాలపై వివరించారు. ఇతర వ్యక్తులను దూషించినట్లుగా, గొడవలను ప్రేరేపించే విధంగా పోస్టులు ఉన్న వారితో పాటుగా, ఆయా గ్రూపుల అడ్మిన్‌లపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి పోస్టులను నిశితంగా ప్రత్యేక టీం గమనిస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఎన్నికలపై అవగాహన



వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌ఓలకు, సిబ్బందికి అసెంబ్లీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బూత్‌ల వారీగా ఓటరు లిస్టులను సక్రమంగా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో అందరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనువాస్, ఆర్‌ఐలు తదితరులు ఉన్నారు.

సారా అమ్మితే చర్యలు



అచ్చంపేట రూరల్: నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని కన్యతండా, శివారుతండాలో దాడులు నిర్వహించారు. 15 లీటర్ల నాటుసారా, 50 కేజీల నల్లబెల్లంను స్వాధీనం చేసుకుని 530 లీటర్ల బెల్లం పానకంను పారబోశారు. నిందితురాలు నిర్మలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే గోపాల్ నగర్ తండాకు చెందిన మోతీలాల్ బైక్‌పై అచ్చంపేటకు 7.5 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్, సిబ్బంది ప్రకాష్, అంజనేయులు, బాలయ్య, నవీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని సబ్‌స్టేషన్లకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సూర్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తిలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా మండలానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఏఈ కోరారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోడేరు: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బాలచందర్‌సృజన హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మైలారంలో హరితహారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండ చూడాలని సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు ఏపీఓ మొక్కలను పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ మోహన్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



కొల్లాపూర్: ఫర్టిలైజర్ దుకాణ యజమానులు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఏఓ నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఎరువులను ఆన్‌లైన్‌లో పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మాలని డీలర్లకు సూచించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్ తప్పకుండా మెయింటెన్ చేయాలని ఆయన సూచించారు.

కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: అకారణంగా ఒకరిపై దాడిచేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం మంగళవారం మండలంలోని సుద్దకల్ గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు భూవివాదంపై మండల కేంద్రంలో చర్చించుకుంటున్నారు. గ్రామ సర్పంచ్ భర్త రాంరెడ్డి కలుగచేసుకొని పోలీస్‌స్టేషన్ ఎదుట మొగులాన్ అనే వ్యక్తిపై అకారణంగా దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు రాంరెడ్డిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా బుచ్చయ్య

మన్ననూర్: డీసీసీ ఉపాధ్యక్షుడిగా గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పంబలి బుచ్చయ్యను నియమించారు. ఈ మేరకు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. 35 ఏళ్లుగా బుచ్చయ్య కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా అనేక పదవులు చేపట్టి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



కల్వకుర్తి టౌన్: ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో మున్సిపల్ పరిధిలో ఉన్న పలు పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మంగళవారం వారి సిబ్బందితో కలిసి తొలగించారు. ఫ్లెక్సీలతో పాటుగా ఆయా కాలనీలలో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలు, ఇతర విగ్రహాలు, పార్టీ దిమ్మెలపై ముసుగులు వేశారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఎన్నికల కోడ్ రావడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయా పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను తొలగించారు.

చారకొండ: మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు పాటించాలని డీటీ విద్యాధరి అన్నారు. మంగళవారం గ్రామాల్లో పర్యటించారు. గోడలపై రైటింగ్, జెండాలు, ఫ్లెక్సీలు గ్రామాల్లో తొలగించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఆర్‌ఐ నభి, తదితరులు ఉన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన

కొల్లాపూర్: పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో బ్యాంకు స్కీంలు, లావాదేవీలపై ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు, విద్యార్థులకు అందించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో సురగాని శ్రీనివాస్‌గౌడ్, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

పెంట్లవెల్లి: ప్రతి ఒక్కరికి బ్యాంక్ సేవలపై అవగాహన ఉండాలని ఏపీజీవీబీ మేనేజర్ రాంగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొండూరులో రుణాలు, ఇన్సూరెన్స్, ఎడ్యుకేషన్ లోన్‌లపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సైబర్‌మోసాల అవగాహన కల్పించారు. సైబర్ నేరాగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, మేనేజర్ రాంగోపాల్, బ్యాంక్ సిబ్బంది దామోదర్, విజయ్, కళాకారులు పాల్గొన్నారు.



కొల్లాలపూర్‌లో మాట్లాడుతున్న బీఎం ఉదయ్‌కుమార్

ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం

తాడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని సీనియర్ నాయకుడు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పర్వతాయిపల్లి తండాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ రోహిణి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఎస్పీ ఇంటింటికి..



కొల్లాపూర్ రూరల్: మండలంలోని చౌటబెట్లలో బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిని భారీ మెజార్టీలో గెలిపించాలని కోరారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు బంకల దాస్, తేజ, నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన కార్మికులు



తెలకపల్లి: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశానికి మండల కేంద్రం నుంచి కార్మికులు మంగళవారం తరలివెళ్లారు. ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేసినట్లు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. కార్మికులు సరస్వతి, ప్రశాంతి, పార్వతమ్మ, గీతారాణి, స్వప్న, శాంతమ్మ, పద్మతోపాటు సీపీఎం నాయకులు విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈగా రమణి

ఊర్కొండ: మండల కేంద్రంలో విద్యుత్ ఏఈగా రమణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న రవి నాయక్ బదిలీపై పదర మండలానికి వెళ్లాడు.

వంశ వృక్ష చిత్రపటాల పంపిణీ



అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్తమార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కిషోర్ హాజరయ్యారు. వంశవృక్ష చిత్రపటాలను పద్మశాలి కుల బంధువులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీందర్, సత్యనారాయణ, సుధాకర్, కృష్ణయ్య, రాజు, రమేష్, సంతోష్, సైదులు, వెంకట్, శేఖర్ పాల్గొన్నారు.

మానసిక వికలాంగులను చిన్నచూపు చూడొద్దు



కందనూలు: మానసిక వికలాంగులను చిన్నచూపు చూడొద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు అన్నారు. జిల్లా న్యాయ సేవా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్‌లో మానసిక, ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక స్థితి సరిగ్గా లేని విద్యార్థులు జీవించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం న్యాయవాదులు విద్యార్థుల కోసం రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సబిత, మౌనిక, రఘునాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉపాధి కల్పించాలి

మన్ననూర్: దుర్భర పరిస్థితుల్లో కుటుంబ జీవనాన్ని వెళ్లదీస్తున్న గిరిజన కుటుంబాలకు ప్రత్యేక ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని బీఎల్‌ఎఫ్ అచ్చంపేట ఇన్‌చార్జ్ శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న గిరిజన మహిళా కూలీలను ఆయన కలిసి మాట్లాడారు. రాజకీయ పార్టీలు గిరిజనులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికై నా గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి

కొల్లాపూర్: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకానికి రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని వ్యవసాయ జిల్లా అధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఏడీఏ రవితో పాటు ఏఓలు, ఏఈఓలు ఉన్నారు.

సమ్మె తాత్కాలికంగా వాయిదా

తెలకపల్లి: సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఎన్నికల కోడ్ రావడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మణ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఆశా కార్యకర్తలు విధుల్లో చేరినట్లు ఆయన తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

కందనూలు: వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దని నాగర్‌కర్నూల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అడ్మిన్‌లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిద్దాం

కోడేరు: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిద్దామని ఆయా పార్టీల నాయకులు సహకరించాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో వివిధ పార్టీల నాయకులతో ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టరాదని అన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రవి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.